RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

Malkajgiri | Volume: 2 | Issue: 276 | Friday, January 24, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక : 276 | శుక్రవారం, జనవరి 24, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4/-

## ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం...

# 1200 విద్యుత్తు బస్సులను ప్రవేశపెట్టింది

## - మోడీ



దేశ రాజధానిలో కర్బనాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 1200 విద్యుత్తు బస్సులు ఢిల్లీలో నడుస్తున్నాయని, మరిన్ని విద్యుత్తు బస్సులను కూడా ఇస్తామని, ఇండ్లపైకప్పుపై సోలార్ ప్యానెళ్లను పెట్టించడం మరో చొరవ అని ప్రధాని నరేంద్ర మోడీ గురువారం తెలిపారు. పాత పార్లమెంటు భవన్‌లోని సెంట్రల్ హాల్‌లో ఆయన విద్యార్థులతో మాటామంతీ జరుపుతూ ఈ విషయం తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి వారు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్ర బోస్ జన్మదినోత్సవం సందర్భంగా అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మోడీ ఓ విద్యార్థినీని 'నీకు నచ్చిన సుభాష్ చంద్ర బోస్ నినాదం ఏమిటి?' అని ప్రశ్నించగా, ఆ విద్యార్థినీ 'నాకు రక్తం ఇవ్వండి, మీకు స్వాతంత్ర్యం వాగ్దానం చేస్తా' అని తెలిపింది. దీనిని అధికార ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె ఇంకా ఆయన అన్నిటి కన్నా దేశం ప్రధానం అన్నారని, ఆయన ఆ అంకిత భావమే నేటికి విద్యార్థులకు ప్రేరణగా ఉందన్నది. అంతేకాక నేడు దేశంలో కర్బనాన్ని తగ్గించే ప్రేరణ కూడా ఆయన నుంచే వచ్చిందని ఆమె పేర్కొంది. సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌డిజిస్) కూడా అందులో భాగమే అన్నది. అందుకు ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటోంది? అని ప్రశ్నించినప్పుడు ఆమె 'విద్యుత్తు బస్సులను ప్రవేశపెట్టింది' అని జవాబిచ్చింది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిని 1200 విద్యుత్తు బస్సలు నడుస్తున్నాయని, మరిన్ని తెస్తామని అన్నారు.

## మహాకుంభమేళా....

# 10 కోట్లకు పైగా భక్తుల పుణ్యస్నానాలు

ప్రయాగ్‌రాజ్ : మహాకుంభమేళాలో గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు 10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. మకరసంక్రాంతి రోజు దాదాపు 3.5 కోట్ల మంది సంగమంలో స్నానాలు ఆచరించారు. 1.7 కోట్ల మంది పౌష్ పూర్ణిమ వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో పండగల వేళలో స్నానాల ప్రదేశంలో భక్తుల సంఖ్యపై ప్రభుత్వం పరిమితులు విధించింది. మిగిలిన రోజుల్లో ఎలాంటి ఆంక్షలు అమలులో ఉండవు. అయితే ఈసారి కుంభమేళాకు 45 కోట్ల మందికి పైగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా. మకరసంక్రాంతి రోజు దాదాపు 3.5 కోట్ల మంది సంగమంలో స్నానాలు ఆచరించారు. 1.7 కోట్ల మంది పౌష్ పూర్ణిమ వేడుకల్లో పాల్గొన్నారు. ఇప్పటివరకు 10 కోట్ల మందికి పైగా భక్తులు వచ్చినట్టు తెలుస్తోంది.



## అక్రమ వలసదారుల నిర్బంధ బిల్లుకు...

# కాంగ్రెస్ ఆమోదం



**వాషింగ్టన్ :** అక్రమ వలసల అణచివేతే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడుగులు వేస్తున్నారు. అక్రమ వలస దారుల బహిష్కరణకు సంబంధించిన కీలక బిల్లుకు తాజాగా కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. అధ్యక్షుడిగా ట్రంప్ సంతకం చేసే తొలి బిల్లు ఇదే అయ్యే అవకాశం ఉంది. దొంగతనాలు, తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని అదుపు లోకి తీసుకునేలా రూపొందించిన ఈ బిల్లుకు బుధవారం ఆమోదం తెలిపింది. దాదాపు మూడు దశాబ్దాల తరువాత కాంగ్రెస్ ఆమోదించిన అత్యంత ముఖ్యమైన ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బిల్లు ఇదే అని అలబామా రిపబ్లికన్ సెనేటర్ కేటీ బ్రిట్ పేర్కొన్నారు. అయితే ఈ బిల్లు అమలుకు ప్రస్తుతం ఉన్న నిధులు సరిపోవని ఫెడరల్ అధికారులు హెచ్చరించారు. దీంతో బిల్లు అమలుకు అడ్డంకులు ఎదురయ్యే అవకాశాలున్నాయని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు మెక్సికో సరిహద్దుల్లో శరణార్థ శిబిరాలు అక్రమ వలసదారులను బయటకు పంపుతాననే ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో మెక్సికో తన సరిహద్దు రాష్ట్రాల్లో శరణార్థ శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. టెక్సాస్ లోని ఎల్ పాసో సరిహద్దుకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో పెద్ద ఎత్తున శిబిరాలను నిర్మిస్తోంది. బహిష్కరణకు గురైన వారి కోసం ఏర్పాటు చేస్తోన్న ఈ శిబిరాలు ప్రారంభ దశ మాత్రమే. వలసదారుల సంఖ్య ఆధారంగా వీటిని పెంచుతాం అని మెక్సికో లోని ఓ అధికారి తెలిపారు. మెక్సికన్ నగరానికి పంపించాలని ఆయన సూచించారు. 1500 క్రియాశీలక బలగాలను మోహరించిన పెంటగాన్ దక్షిణ సరిహద్దుల్లో నిఘా కోసం 1500 క్రియాశీలక బలగాలను మోహరిస్తున్నట్టు పెంటగాన్ పేర్కొంది. ఇప్పటికే నిర్బంధించిన 5 వేల మందికి పైగా వలసదారులను దేశం నుంచి పంపించే విషయంలో హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌కు తాము మద్దతుగా ఉంటామని పెంటగాన్ వెల్లడించింది. అక్రమ వలసదారుల బహిష్కరణ కోసం తాము సైనిక విమానాలను పంపిస్తామని తాత్కాలిక రక్షణ కార్యదర్శి రాబర్ట్ సాలెస్సెస్ తెలిపారు.

## భాగమతి నుంచి బాలాసోర్ వరకు..

# దేశాన్ని కుదిపేసిన రైలు ప్రమాదాలు ఇవే..!



గత కొంతకాలంగా రైలు ప్రమాదాలు ప్రయాణికులను కలవరానికి గురి చేస్తున్నాయి. గత కొద్దిరోజులుగా రైళ్ల పట్టాలు తప్పడం.. మంటలు చెలరేగడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. గత కొంతకాలంగా రైలు ప్రమాదాలు ప్రయాణికులను కలవరానికి గురి చేస్తున్నాయి. గత కొద్దిరోజులుగా రైలు పట్టాలు తప్పడం.. మంటలు చెలరేగడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే, బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నుంచి మహారాష్ట్రలోని ముంబయికి వెళ్తున్న పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు జల్గావ్ సమీపంలో ప్రమాదానికి గురైంది. రైలు పచోరా పర్ధాడే స్టేషన్ సమయంలో మంటలు చెలరేగాయని ప్రచారం జరిగింది. ఆ తర్వాత పలువురు ప్రయాణికులు రైలు నుంచి దూకేశారు.

## గరియాబాద్ లో ఎన్ కౌంటర్....

# మరో కీలక నేత హతం



**రాయ్ పూర్:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబాద్ ఎన్‌కౌంటర్‌లో మరో మావోయిస్టు కీలక నేతను హతమయ్యారు. మావోయిస్టులు భద్రతాబలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ప్రమోద్ మృతి చెందారు. ప్రమోద్ అలియాస్ చంద్రహాస్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అని భద్రతా బలగాలు వెల్లడించాయి. ఒడిశాతో పాటు ఈస్ట్ జోనల్ బ్యూరో ఇంఛార్జ్‌గా చంద్రహాస్ పనిచేశారు. చంద్రహాస్‌పై రూ.20 లక్షలకు పైగా రివార్డు కూడా ఉంది. ఛత్తీస్‌గఢ్ ఒడిశా సరిహద్దుల్లోని గరియాబాద్ లో సోమవారం రాత్రి జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 27 మావోయిస్టులు మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

## స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల పెంపు...

# ఇంకెంత కాలం...?

### - ఎంఎల్‌సి కవిత

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఇంకెంత కాలం తాత్సారం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కులగణన పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బిసి డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ మేరకు గురువారం నాడు ఎంఎల్‌సి కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బిసిలకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి 2024 -25 బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసి తొలి ఏడాదే కామారెడ్డి డిక్లరేషన్‌ను సిఎం రేవంత్ రెడ్డి ఉల్లంఘించారని విమర్శించారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల బిసి వర్గాల్లో ఏ మాత్రం విశ్వానం లేదని, ఈ వైఖరితో రాష్ట్రంలో బిసిలంతా తీరని అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం అని తెలిపారు. కుల గణన, బిసి కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బిసిలకు రిజర్వేషన్ల పెంపు అని కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో స్పష్టంగా పేర్కొని ఉందని అన్నారు.



# రాంగోపాల్ వర్మకు బిగ్ షాక్!




**ముంబయి :** దర్శకుడు రాంగోపాల్ వర్మకు బిగ్ షాక్ తగిలింది. 2018లో నమోదైన చెక్ బౌన్స్ కేసులో ఆర్ జివిని కోర్టు దోషిగా తేల్చింది. ఆర్ జివికి 3 నెలల జైలు శిక్ష, రూ.3.72 లక్షల జరిమానాను ముంబై అంధేరి కోర్టు విధించింది. ఫిర్యాదుదారునికి డబ్బు ఇవ్వకపోతే మరో 3 నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చింది. ఎపి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వ్యూహం సినిమాలో భాగంగా టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా సోషల్ మీడియాలో రాంగోపాల్ వర్మ పోస్టులు పెట్టిన విషయం తెలిసిందే.

# తెలంగాణ షాన్

## సంపాదకీయం

### టెంపరి ట్రంప్ ఏం చేస్తాడో?

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన అమెరికా 47వ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రసంగం, వెంటనే తీసుకున్న నిర్ణయాలు ఊహించిన విధంగానే ఉన్నాయి. ఇంకా అనేక అంశాల మీద వైఖరులు, ఆచరణను ప్రకటించాల్సి ఉంది. ప్రమాణస్వీకార సభకు వచ్చిన వారంతా వంది మాగధులు, లాభాలను ఆశించే కార్పొరేట్ శక్తులు, వారికి మద్దతునిచ్చే రాజకీయ నేతలే గనుక హర్షధ్వానాలు, ఆహా ఓహోలకు కొదవ లేకుండా సాగింది. అలాంటి వారిని అలరించేందుకు, మద్దతుదార్లను సంతుష్టీకరించేందుకు పలికిన పలుకుల సారం చూస్తే ఆత్మస్తుతి, పరనింద, ఎదురుదాడితో సాగిందన్నది స్పష్టం.' నేటి నుంచి ప్రపంచంలో మరోసారి అమెరికాను గౌరవిస్తారు.ప్రతి క్షణం, ప్రతి రోజు అమెరికాను అగ్రస్థానంలో నిలుపుతా. స్వారభౌమత్వాన్ని, భద్రతను పునరుద్దరిస్తా.గతం కంటే బలంగా, గొప్పగా దేశం మారుతుంది. మరమ్మతు చేయటానికి వీల్లేని విధంగా సమాజ మూలస్తంభాలను గత పాలకులు దెబ్బతీశారు.విదేశాల సరిహద్దులను కాపాడేందుకు గత ప్రభుత్వం అపరిమిత నిధులు ఇచ్చింది తప్ప అమెరికా సరిహద్దులు, స్వంత జనాన్ని రక్షించేందుకు నిరాకరించింది. అమెరికాను మరోసారి గొప్పగా నిలబెట్టేందుకు హత్యాయత్నం నుంచి దేవుడు నన్ను రక్షించాడు. ఈ రోజు అమెరికన్లకు విముక్తి దినం.' ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా ఇలాంటివే ఎన్నో ఉన్నాయి. గత ప్రభుత్వం తీసుకున్న వాటిలో 78 నిర్ణయాలను రద్దు చేస్తూ సంతకాలు చేశాడు. వాతావరణ మార్పులపై 2016లో కుదిరిన పారిస్ ఒప్పందం నుంచి వైదొలగటం వాటిలో ఒకటి. తొలిసారి 2017లో ఆ నిర్ణయం తీసుకున్నాడు. తరువాత అధికారానికి వచ్చిన జో బైడెన్ తిరిగి ఒప్పందంలో అమెరికాను చేర్చాడు. దాన్ని ట్రంప్ రెండోసారి తిరగదోడాడు. కాలుష్యం, భూతలం వేడెక్కకుండా చూసే బాధ్యత నుంచి వైదొలగటం అత్యంత బాధ్యతారహితం.కాలుష్యానికి కారణమైన దేశాల్లో అమెరికా ఒకటి. దానివలన సంభవిస్తున్న వ్యాధులు, ఆరోగ్య సమస్యల నివారణ నుంచి కూడా అది తప్పించుకోలేదు. అనారోగ్యం నుంచి కూడా లాభాలు పిండుకుంటున్న కార్పొరేట్ ఔషధ సంస్థలకూ అది నిలయమే. అలాంటి దేశం ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి తప్పుకోవాలని ట్రంప్ సంతకం చేశాడు. కరోనా సమయంలో ప్రపంచ మంతటా 70లక్షల మంది మరణిస్తే అత్యంత బాధ్యతా రహితంగా వ్యవహరిం చిన ఆ 'పిచ్చివాడి' కారణంగా అమెరికాలో పన్నెండు లక్షల ప్రాణాలు పోయాయి.తన వైఫల్యాన్ని మూసిపెట్టేందకు కరోనా కారకురాలు చైనా అని నిర్ధారించాలన్న ట్రంప్ ఒత్తిడిని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిరాకరించిన కారణంగా తొలిసారి తన ఏలుబడిలో వైదొలిగాడు. పారిస్ ఒప్పందం మాదిరే బైడెన్ తిరిగి ప్రవేశించి అంతకుముందు మాదిరే నిధులు ఇచ్చాడు. ఇప్పుడు ట్రంప్ మళ్లీ మొదటికి వచ్చాడు.అమెరికా అంతర్గత అంశాలకు వస్తే ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌ను స్తంభింప చేశాడు. స్వర్ణయుగం ఇప్పటి నుంచే ప్రారంభమైందని ట్రంప్ వర్ణిస్తే, రారాజు తిరిగి వచ్చాడంటూ ఎలన్ మస్క్, సుందర్ పిచ్చరు, టిమ్ కుక్ వంటి వారు పొంగిపోయారంటే కార్పొరేట్ శక్తులు రెచ్చిపోతాయన్నది స్పష్టమే. దాన్ని మరోవిధంగా చెప్పాలంటే కార్మికవర్గం మీద దాడి పెరుగుతుంది. జో బైడెన్ ఎన్నికను అంగీకరించేది లేదంటూ 2021లో అమెరికా అధికార కేంద్రంపై దాడికి పాల్పడిన తన అనుచరులు 1500 మందిపై కేసులను ఉ పసంహరించాడు, 14 మంది పచ్చి మితవాదులకు శిక్షలు తగ్గించాడు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

**కాప్రా జనవరి 23 తెలంగాణ షాన్ ప్రతినిధి జి. ఆంజనేయులు:** నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి వేడుకలు పాల్గొని నివాళులర్పించిన కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి , మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయమార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ జి. విఠల్ నాయక్ ఈరోజు కాప్రా డివిజన్ నేతాజీనగర్ చౌరస్తాలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలో పాల్గొని ఘనంగా నివాళులర్పించిన కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి , మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయమార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ జి విఠల్ నాయక్ . ఈ సందర్బంగా కార్పొరేటర్ మాట్లాడుతూ - భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రత్యేకస్థానం పొందారని , స్ఫూర్తి దాయకమైన వారి ధైర్య సాహసాల ఫలితంగా దేశంలో స్వాతంత్ర కాంక్ష బలంగా రగిలిందని తెలిపారు. జిల్లా AMC వైస్ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ- భారత స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థానం ప్రత్యేకమైనది. అహింసా మార్గములో స్వాతంత్ర్యం అసాధ్యమని భావించి సంగ్రామమే సరైన మార్గమని ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి ప్రత్యేక మిలటరీని ఏర్పాటు చేసి బ్రిటీషు సార్వభౌమత్యానికి వ్యతిరేకంగా పని చేశారని, ప్రపంచచరిత్రలో జననం తప్ప మరణమే లేని ఏకైక భారత స్వాతంత్ర్య




సమరయోధులు నేతాజీ గారని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి , నరేందర్ గౌడ్ , సంతోష్ చారీ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## హైడ్రా కమిషనర్ తో దేవాలయ భూముల కబ్జాపై చర్చించిన సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



**కుత్బుల్లాపూర్ జనవరి 24 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూములు పరికిచెరువు అంశం పైన స్థానిక నాయకులు మరియు ప్రభుత్వ అధికారులతోటి హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమస్యల పైన చర్చించడం జరిగింది. రంగనాథ్ మాట్లాడుతూ దేవాలయ భూములు ప్రభుత్వానికి సంబంధించినవి కానీ ఏ వ్యక్తికో ఏ సంఘానికి చందనివని కావున ఏర్పాటు చేసినటువంటి దేవాలయాలు కట్టుకున్న గోడల వల్ల కొంతమంది ఆ భూములు తమకి చెందిన వాని భావించి కమర్షియల్ గా ఉపయోగించుకుంటూ లబ్ధి పొందుతున్నారని అలా లబ్ధి పొందడం అనేది చట్టరీత్యా వెంటనే అక్కడ ఏర్పాటు చేసుకున్నటువంటి హద్దులు గోడలను తీసివేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగింది. అదేవిధంగా పరికిచెరువు సంబంధించి అక్కడ కబ్జాదారులు పూచినటువంటి ఫోటోలను వీడియోలను చూసి అసలు ఆ స్థలము ప్రభుత్వాన్నిగా ప్రైవేటుదా అని రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా ఆ భూములు ప్రభుత్వానివే అని గతంలో కూడా అక్కడ కూల్చిన మని చెప్పడం, ఆ భూములు మాకు సంబంధించినయని కాగితాలను కాగితాలను తీసుకొని పరిశీలించాలని ఆదేశించడం జరిగింది. చెరువును ఎట్టి పరిస్థితుల్లో పరిరక్షించుకోవాలని అక్కడ కొత్తగా ఎటువంటి నిర్మాణాలను చేపట్టకూడదని చేపట్టితో వెంటనే కూల్చివేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది. హైడ్రా ఆదేశాల ప్రకారం జూన్ 2024 తర్వాత నిర్మించి నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తారని అంతకుముందు నిర్మాణాలను కాబట్టి ఎవరైనా ప్రజలు డైరెక్ట్ గా రంగనాథ్ కి కంప్లైంట్ చేయాలని కోరడం జరిగింది.

## కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ట్రస్మా రాష్ట్ర నూతన అధ్యక్షులు శివరాత్రి యాదగిరి





**కుత్బుల్లాపూర్ జనవరి 24 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజు గౌడ్:** ఇటీవల ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన జగద్గిరిగుట్ట చైతన్య విద్యానికేతన్ కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి గురువారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత, హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడంతో పాటు ఫిబ్రవరి 4వ తేదీ నుంచి నిర్వహించనున్న మండల స్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ని ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన శివరాత్రి యాదగిరి కి ముందుగా శుభాకాంక్షలు. రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన పాఠశాలల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన శివరాత్రి యాదగిరి గారికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. అనంతరం ట్రస్మా నూతన అధ్యక్షులుగా నియమితులైన శివరాత్రి యాదగిరి ని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా కోశాధికారి పరశురాం గౌడ్, కుత్బుల్లాపూర్ ట్రస్మా అధ్యక్షులు శ్రీనివాస్, సెక్రటరీ తిరుపతిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు నర్సిరెడ్డి, వనజ, అశోక్, ఛాయా, ప్రవీణ్, కుమార్, బలవంత్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## కాప్రాలో ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు - తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ జన్మదిన వేడుకలు



**కాప్రా జనవరి 23 తెలంగాణ షాన్ ప్రతినిధి జి.ఆంజనేయులు:** తెలుగు దేశం పార్టీ కాప్రా సర్కిల్ తెలుగు దేశం నాయకుల ఆద్వర్యం లో తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు 42 వ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా కన్వీనర్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ గౌడ్ మాజీ ఉపాధ్యక్షుడు టి జి కె మూర్తి మాజీ కౌన్సిలర్ గడ్డమిది రాములు యాదవ్, ఎర్ర రమేష్ గౌడ్, కాంటెస్ట్ కార్పరేటర్ నిర్మలా సాంబమూర్తి గౌడ్ దూడల సాంబమూర్తి గౌడ్ ఉప్పల్ ఆడ హక్ కమిటి మెంబర్ కనక మెడల రాంబాబు, రుద్ర గొని రామచందర్ గౌడ్, నీరు కొండ సతీష్ బాబు, సూర్ణం రాజేష్, తిక్క ప్రకాష్, శ్రీరాములు, పాండు, ప్రేమ్ కుమార్ గౌడ్,జంగారెడ్డి, ఉ మాశంకర్ గౌడ్, శివానంద్, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, వడ్లమూడి శ్రీనివాస్, కిషోర్, సత్యం, నందం గౌడ్ , బొప్పన శ్రీనివాసరావు, అవినాష్ గౌడ్, పరమేష్, మహిళా నాయకురాలు సావిత్రి, ప్రతిభ, హరి, నవీన్, కృష్ణారావు ,గోబేరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనంత్ నకిరికంటి పుట్టినరోజు సందర్భముగా ఉచిత భోజనం అందజేత

**హైదరాబాద్, జనవరి, 23:** నకరికంటి అనంత్ తన ఆలోచనా శక్తితో చిన్న వయసులోనే గొప్ప వ్యాపారవేత్తగా ఎదిగారు-మదుపల్లి రవి గుప్తా ఉచిత భోజనం అందచేయడం కేవలం



వినూత్నమైనదే కాదు, పలువురి ఆకలి తీర్చే గొప్ప సేవగా నిలుస్తోంది- రామస్వామిసేవలకు చిరునామాగా నిలుస్తున్న విఠల్- కొత్త వెంకటేశ్వర్లు.జీవిత బీమా ఏజెంట్ గా అనంత్ నన్ను ఎంచుకోవడం నా అదృష్టం- కౌటికె విఠల్‌తన పాలసీదారుల పుట్టినరోజులను వినూత్నంగా జరపడం భారతీయ జీవిత బీమా సంస్థ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ కౌటికె విఠల్ కే ప్రత్యేకతగా నిలుస్తోంది.

తన విలువైన పాలసీదారుడు అనంత్ నకరికంటి పుట్టినరోజు సందర్భంగా, కౌటికె విఠల్ మంగళవారం రోజున బసవతారకం ఆసుపత్రి వద్ద వెయ్యి మందికి ఉచితపంక్తి భోజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి రోగుల కుటుంబ సభ్యులు, స్థానికంగా ఆకలితో ఉన్నవారికి ఆహార సేవలు అందించారు. కార్యక్రమము పగడ్బందీగా నిర్వహించబడగా, భోజనం చేసినవారు సంతోషంతో దీవెనలు అందించారు.

## స్వాతంత్ర్య సమరవీరుల్లో అగ్రగన్యుడు నేతాజీ చంద్రబోస్: కూన శ్రీశైలం గౌడ్







**కుత్బుల్లాపూర్ జనవరి 24 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సుభాష్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య సమరవీరుల్లో నేతాజీ చంద్రబోస్ అగ్రగన్యుడని కొనియాడారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా మరియు భారతదేశ సైన్యాధిపతి వారి సేవలు మరువలేనివాన్నారు. ఈ కార్యక్రమంలో కొనేటి నర్సింహా రావు, తులసి, నాగిరెడ్డి, వీరేశం, గుబ్బల రమణ, రంగనాథ్, కుమ్మరి శంకర్, మల్లేష్ గౌడ్, శైలజ, పాటిల్, మురళి, సంతోష్, త్రిమూర్తులు, నాగార్జున, జగదీష్ చక్రి, పరుశురాం, డి రవి, సలోమి తో పాటు తదితరులు పాల్గొన్నారు..



# సిరిసిల్ల నేతన్నలకు బంపర్ ఆఫర్



**కరీంనగర్ :** వస్త్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సిరిసిల్ల నేతన్నకు రాష్ట్ర ప్రభుత్వం చేయుతనిచ్చింది. త్వరలో మహిళా గ్రూపులకు అందజేసే చీరల ఆర్డర్స్ సిరిసిల్ల నేతన్నకు సర్కార్ ఇచ్చింది. సాంచల చప్పుడుతో నేతన్నలు బిజీగా మారుతున్నారుసిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి నేతన్న బతుకు పై భరోసా కల్పించే చర్యలు ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు అందించే యూనిఫామ్ చీరల ఆర్డర్స్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అందజేశారు.ఇందిరా క్రాంతి మహిళా శక్తి చీరల పథకంలో భాగంగా ఒకే రంగు చీరల ఆర్డర్స్ 4.24 కోట్ల మీటర్లు అందజేసింది. ఈ చీరలను ఈ ఏప్రిల్ 30 వ తేదీలోగా సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేసిందని టెస్కో జీఎం అశోక్ రావు తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మార్కెట్ తో పోటీపడి స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారుప్రభుత్వ, ప్రైవేట్ ఆర్డర్స్ తయారు చేసేలా యంత్రాలు ఆధునీకరించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రూ. 500 కోట్ల బకాయిలు విడుదల చేసిందని తెలిపారు. ఆధునిక, నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసేలా సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఇప్పటికే స్కూల్ యూనిఫాం మరమగ్గాల సంఘాలకు 65.67 లక్షల మీటర్లు ఆర్డర్స్ ఇచ్చామని వెల్లడించారుఆర్డర్స్ అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ సెక్రటరీకి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్డర్స్ కాపీ అందుకునే కార్యక్రమంలో హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సాగర్, టెస్కో ఏడీ సందీప్ జోషి తదితరులు పాల్గొన్నారుబతుకమ్మ చీరలు రద్దుతో నేత కార్మికులు ఆర్థిక ఇబ్బందుల పాలయ్యారు. నేసిన గుడ్డకు గిరాకీ లేక, చేతినిండా పని దొరక్క నేత కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఏడాది కాలంలో 30 మందికి పైగా ఆత్మహత్య చేసుకున్నారు. సంక్రాంతి కి రెండు నెలల ముందు తమిళనాడు ప్రభుత్వం పొంగల్ చీరల ఆర్డర్ తో నేత కార్మికులకు కాస్త ఊరట లభించింది. ప్రస్తుతం మహిళా గ్రూపులకు పంపిణీ చేసే చీరల ఆర్డర్ రావడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆర్డర్లు అన్ని సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకే ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పోచంపల్లి చీర.. రెండు డిజైన్లుప్రపంచవ్యాప్తంగా మగువలు మెచ్చే పట్టు చీరలకు ప్రసిద్ధి పోచంపల్లి. చేనేత కార్మికుల నైపుణ్యానికి ప్రతీక ఇక్కడి ఈ చీరలు. సృజనాత్మకత, నూతన డిజైన్లతో వస్త్రాల తయారీ ఇక్కడి చేనేత కార్మికుల అద్భుత కళారూపానికి నిదర్శనం. రెండు వైపులా వేర్వేరు డిజైన్లు, వేర్వేరు రంగులు కలిగిన ఇక్కత్‌పట్టు చీరను నేసి తెలంగాణ చేనేత ఘనతను ఓ కళాకారుడు ఔరా అనిపించాడు.ఇక్కడి చేనేత కార్మికుల అద్భుత కళారూపాలు ఖండాంతర ఖ్యాతిని సాధించాయి. ఈ ప్రాంతంలోని నేతన్నలు ఎన్నో చేనేత పురస్కారాలను అందుకున్నారు. తాజాగా ఓ యువ చేనేత కళాకారుడు రెండు వైపులా వేర్వేరు డిజైన్లు, వేర్వేరు రంగులు కలిగిన ఇక్కత్‌పట్టు చీరను సృష్టించాడు. యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లికి చెందిన సాయిని భరత్ అనే యువ చేనేత కళాకారుడు అద్భుత కళ రూపాలను రూపొందిస్తున్నాడు. ఎంటెక్ చేసిన సాయిని భరత్ కు చేనేత పై ఎంతో మక్కువ. అంది వస్తున్న టెక్నాలజీ సహాయంతో చేనేత రంగంలో అద్భుతాలు సృష్టించాలని ప్రయత్నించాడు. ఇందులో భాగంగానే కొన్నేళ్ల క్రితం భరత్ మొదటి సారిగా రెండు వేర్వేరు రంగులు, డిజైన్లు కలిగిన ఇక్కత్ దుపట్టాను మగ్గంపై తయారు చేశారు. ఎంతో కళాత్మకంగా దుపట్టాను రూపొందించి నందుకు గాను 2018లో కేంద్ర ప్రభుత్వం నుంచి నేషనల్ మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. అదే స్ఫూర్తితో ఇక్కత్ కీర్తిని ఖండాంతరం చేయాలని రెండున్నర ఏళ్లు కష్టపడి, ఎంతో సృజనాత్మకంగా ఆలోచించి ఒక చీరకు వేర్వేరు డిజైన్లు, రంగులు వచ్చేలా అభివృద్ధి చేశారు.అనంతరం టై అండ్ డై డిజైనింగ్, మగ్గంతో పాటు వీవింగ్‌లో సైతం ప్రత్యేకమైన పరిజ్ఞానాన్ని వినియోగించి 15 రోజులు మగ్గంపై నేసి రెండు వైపులా వేర్వేరు డిజైన్లు, రంగులు కలిగిన ఉల్టా లేని పట్టు చీరను తయారు చేశారు. దీంతోపాటు కొత్త డిజైన్లతో 3 శాంపిల్ ఇక్కత్ పట్టుచీరలను రూపొందించారు. వీటికి పేటెంట్ కోసం భరత్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కత్‌లో సాధ్యం కాని ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి.. పరిశ్రమకు కొత్త ఇమేజ్ తీసుకొస్తున్న భరత్ ప్రతిభను కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులు, స్థానికులు ప్రశంసిస్తున్నారు. పట్టుచీరలే కాకుండా భవిష్యత్తులో ఫర్నిషింగ్ వస్త్రాలనూ రూపొందించనున్నట్లు భరత్ తెలిపారు.

# హైదరాబాద్ లో తగ్గిన రియల్ జోష్...

**హైదరాబాద్ :** గృహ విక్రయాలు 2024లో 5 లక్షల యూనిట్ల నుంచి 4.70 లక్షల యూనిట్లకు పడిపోయాయి. హైదరాబాద్‌లో అత్యధిక క్షీణత కనిపించింది. ఢిల్లీ–ఎన్సీఆర్, నవీ ముంబై నగరాల్లో మాత్రమే అమ్మకాలు పెరిగాయి.టాప్ 9 నగరాల్లో హౌసింగ్ సేల్స్ 9 శాతం క్షీణించి 4.7 లక్షల యూనిట్లకు పరిమితమయ్యాయి. అదే సమయంలో సార్వత్రిక ఎన్నికలు, రుతుపవనాల కారణంగా కార్యకలాపాలు రెండొంతులు తగ్గడంతో 2024లో కొత్త సరఫరా 15 శాతం క్షీణించి 4.11 లక్షల యూనిట్లకు పడిపోయిందని ఎన్ఎస్ఈ లిస్టెడ్ రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్ ఈక్విటీ నివేదిక తెలిపింది.2023లో విక్రయించిన యూనిట్ల సంఖ్య 5.14 లక్షలు కాగా, 2023లో లాంచ్ చేసిన యూనిట్ల సంఖ్య 4.81 లక్షలుగా ఉంది.2024 లో 9 నగరాలలో రెండు నగరాల్లో మాత్రమే గృహాల అమ్మకాలు పెరిగాయి. నవీ ముంబై అత్యధిక వృద్ధిని నమోదు చేసింది. కాగా హైదరాబాద్ అత్యధిక క్షీణతను నమోదు చేసింది.2024లో నవీ ముంబైలో గృహ విక్రయాలు 16 శాతం పెరిగి 33,870 యూనిట్లకు చేరుకున్నాయి. ఢిల్లీ–ఎన్సీఆర్‌లో గృహ విక్రయాలు 2024లో 5 శాతం పెరిగి 43,923 యూనిట్లకు చేరుకున్నాయి.బెంగళూరులో గృహ విక్రయాలు 9 శాతం క్షీణించి 60,506 యూనిట్లకు పరిమితమయ్యాయి. చెన్నైలో గృహ విక్రయాలు 11 శాతం క్షీణించి 19,212 యూనిట్లకు, హైదరాబాద్ లో 25 శాతం క్షీణించి 61,722 యూనిట్లకు పరిమితమయ్యాయి.

ముంబైలో 6% తగ్గి 50,140 యూనిట్లకు, పూణేలో 13% తగ్గి 92,643 యూనిట్లకు, థానేలో 5% తగ్గి 90,288 యూనిట్లకు చేరుకున్నాయి. కోల్‌కతాలో గృహ అమ్మకాలు 2024 లో 1% తగ్గి 18,595 యూనిట్లకు చేరుకున్నాయి.తొమ్మిది నగరాలకు గాను 4 నగరాల్లో కొత్త సరఫరా పెరిగింది. ఢిల్లీ–ఎన్సిఆర్ అత్యధిక వృద్ధిని నమోదు చేసింది. హైదరాబాద్ అత్యధిక క్షీణతను నమోదు



చేసింది.2023 పీక్ ఇయర్ కావడంతో 2024లో హౌసింగ్ సప్లై, సేల్స్ తగ్గడానికి బేస్ ఎఫెక్ట్ కారణం. అయితే 2024 లో సరఫరా–డిమాండ్ నిష్పత్తి 2023లో మాదిరిగానే ఉంది. ఇది స్థిరాస్తి రంగం మౌలికాంశాలు బలంగా, ఆరోగ్యంగా ఉన్నాయని సూచిస్తుంది " అని ప్రాప్ ఈక్విటీ సీఈవో, వ్యవస్థాపకుడు సమీర్ జసుజా అన్నారు.ఈ ఏడాది సరఫరా, అమ్మకాల పరంగా హైదరాబాద్ అత్యల్ప పనితీరు కనబరిచిందన్నారు. ఎన్సీఆర్‌లోని నగరాలు ఈ ఏడాదిలో కొత్త సరఫరా, అమ్మకాల్లో మంచి వృద్ధిని సాధించాయని తెలిపారు. బలహీనమైన డిమాండ్ డెవలపర్లను కొత్త ప్రాజెక్టులకు నెమ్మదిగా వెళ్లడానికి ప్రేరేపించి ఉండవచ్చునని తెలిపారు.ఢిల్లీ–ఎన్సీఆర్‌లో కొత్త సరఫరా 2024 లో 54% పెరిగి 45503 యూనిట్లకు, బెంగళూరులో సరఫరా 27% పెరిగి 72,111 యూనిట్లకు, చెన్నైలో 6% పెరిగి 20,522 యూనిట్లకు, ముంబై 4% పెరిగి 40,963 యూనిట్లకు చేరుకున్నాయి.హైదరాబాద్ (49%), కోల్‌కతా (28%), నవీ ముంబై (10%), పూణే (27%), థానే (25%) నగరాలలో కొత్త సరఫరా పడిపోయింది.

# హైదరాబాద్ లో హెచ్సీఎల్ కొత్త టెక్ సెంటర్

**దావోస్ :** ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్సీఎల్ టెక్ హైదరాబాద్లో కొత్త టెక్ సెంటర్ను ప్రారంభించనుంది. దావోస్లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో తెలంగాణ పెవిలియన్లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల




శ్రీధర్ బాబు, హెచ్సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సి.విజయకుమార్ తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. ?? హెచ్సీఎల్ కొత్త సెంటర్లో లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సేవలకు ప్రాధాన్యమిస్తుంది. అత్యాధునిక క్లౌడ్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సొల్యూషన్లను అందిస్తుంది.?? హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్సీఎల్ టెక్ కొత్త క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఈ క్యాంపస్ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్ కూడా అందుకుంది. ఈ కొత్త సెంటర్ ఏర్పాటుతో దాదాపు 5,000 మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభించనున్నాయి.ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు, ఐటీలో ప్రతిభా వంతులైన నిపుణులతో ఇప్పటికే హెచ్సీఎల్ గ్లోబల్ నెట్ వర్క్ సెంటర్గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త సెంటర్ మరింత అత్యాధునిక సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తుందని హెచ్సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ గారు అభిప్రాయపడ్డారు. వచ్చే నెలలో ఈ కొత్త సెంటర్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి ని, ఐటీ శాఖ మంత్రి ని ఆహ్వానించారు.?? రాష్ట్రంలో హెచ్సీఎల్ టెక్ సేవల విస్తరణ చేపట్టడాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. ప్రపంచంలో ఐటీ హబ్ గా హైదరాబాద్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకుందని అన్నారు.?? స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు హైదరాబాద్లోని టెక్నాలజీ, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ఐటీ పరిశ్రమను ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించాలని, అందుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారాన్ని అందిస్తామని హెచ్సీఎల్ టెక్ ప్రతినిధులకు తెలిపారు.2007 నుంచే హెచ్సీఎల్ టెక్ హైదరాబాద్ నుంచి ప్రపంచ వ్యాప్తంగా తమ క్లయింట్లకు సేవలను అందిస్తోంది. కొత్త కేంద్రంతో హైదరాబాద్ లో హెచ్సీఎల్ మొత్తం అయిదు సెంటర్లను విస్తరించనుంది.

# భార్యను చంపి... కుక్కర్ లో ఉడికించి... పొడి చేసి...అనుమానమే... పెనుభూతమై




**హైదరాబాద్ :** తెలంగాణలో దారుణం చోటుచేసుకుంది. భార్యను చంపి మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేసి కుక్కర్ లో ఉడికించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ లో ఈ దారుణం జరిగింది. ఈ నెల 18న తన భార్య వెంకట మాధవి కనిపించడం లేదని భర్త గురుమూర్తి...భార్య తల్లిదండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో పోలీసులకు షాకింగ్ విషయాలు తెలిశాయి. భార్యాభర్తలు గురుమూర్తి, వెంకట మాధవి మధ్య గత కొన్ని రోజులుగా మనస్పర్థలు ఉన్నాయని, తరచూ గొడవపడుతుండేవారని పోలీసులకు తెలిపింది. భార్యను చంపిన గురుమూర్తి.. ఆ తర్వాత తనకేం తెలియనట్టు వ్యవహరించాడు. ఎవరికీ అనుమానం రాకుండా అమాయక చక్రవర్తిలా నటించాడు. అయితే రోజులు గడిచినా మాధవి నుంచి ఎలాంటి ఫోన్‌కాల్ రాకపోవడంతో కన్నవాళ్లకు అనుమానం వచ్చింది. తమ బిడ్డ కనిపించడం లేదంటూ ఈనెల 13న మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారుదీంతో భర్త గురుమూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో గురుమూర్తి అసలు విషయం చెప్పాడు.తన భార్యను తానే హత్య చేశానని గురుమూర్తి ఒప్పుకున్నాడు. భార్య మృతదేహాన్ని ముక్క ముక్కలుగా చేసి కుక్కర్ ఉడికించానని చెప్పాడు. అనంతరం ఆ ముక్కలను జిల్లెలగూడ చెరువులో పడేసినట్టు చెప్పాడు. గురుమూర్తి చెప్పిన విషయాలపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహం ఆనవాళ్ల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. గురుమూర్తి గతంలో ఆర్మీలో పనిచేసి రిటైరైనట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం కంచన్‌బాగ్‌లో సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. తూప్రాన్‌పేట్‌లోని దండుపల్లిలో గురుమూర్తి కుటుంబంతో నివశిస్తు?న్నాడు. వెంకట మాధవి మిస్సింగ్ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.ప్రకాశం జిల్లా జేపీ చెరువుకు చెందిన గురుమూర్తి వృత్తి రీత్యా డీఆర్డీవో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తూ.. జిల్లెల్లగూడలోని న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీలో భార్య వెంకట మాధవి(35)తో కలిసి జీవిస్తున్నాడు. వీరి సంసారంలో అనుమానం తలెత్తింది. దీంతో గురుమూర్తి తన భార్య వెంకట మాధవిని అనుమానించేవాడు. ఈ విషయమై ఇరువురి మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ చెలరేగింది. దీంతో ఆగ్రహానికి లోనైనా గురుమూర్తి భార్యను అత్యంత దారుణంగా హత్య చేశాడు. అనంతరం భార్య మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోశాడు. కమర్షియల్ సిలిండర్ తెచ్చి ముక్కలను ఉడకబెట్టాడు. అనంతరం కొన్ని ముక్కలను ఎండబెట్టి పొడిగా మార్చాడు. భార్యను చంపడానికి ముందు ట్రయల్ కోసం ఓ కుక్కను చంపి ముక్కలుగా నరికి ఉడకబెట్టాడు. ఇదే విషయాన్ని విచారణలో అంగీకరించాడన్నారు పోలీసులు.గురుమూర్తి శాడిజం కన్నబిడ్డలతో పాటు బంధువుల్ని నివ్వెరపోయేలా చేసింది. కేవలం అనుమానంతోనే భార్యను కడతేర్చాడా? ఇంకేవైనా కారణాలు ఉన్నాయా? మర్డర్ ఎపిసోడ్‌లో గురుమూర్తికి ఎవరైనా సహకరించారా అన్న కోణంలో పోలీసులు ఆరాతీస్తున్నారుమృతదేహం పొడిని బకెట్‌లో తీసుకువెళ్లి జిల్లెలగూడ చెరువులో కలిపేశాడు.వెంకట మాధవి మృతదేహానికి సంబంధించి ఆనవాళ్ల కోసం పోలీసులు చెరువులో గాలిస్తున్నారు. బుడిద కావడంతో ఎలాంటి ఆనవాళ్లు దొరకడంలేదని తెలుస్తోంది. ఈ ఘటన నగరంలో తీవ్ర కలకంల రేపుతోంది

# జిల్లాల్లో మంత్రులకు నిరసనగా సెగ

**కరీంనగర్ :** తెలంగాణలో నిర్వహిస్తోన్న గ్రామ సభలు నిరసనలకు వేదికగా మారాయి. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం భారీగా దరఖాస్తులు సమర్పిస్తున్నారు. గతంలో ఇచ్చిన దరఖాస్తుల సంగతేంటని ప్రశ్నిస్తూ స్థానిక సమస్యలపై మండిపడుతున్నాయి. మంత్రులకు సైతం నిరసన సెగ తగిలింది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు నిరసన ఆందోళనలకు వేదికలుగా మారుతున్నాయి. రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ల కోసం భారీగా దరఖాస్తులు సమర్పిస్తూనే ఇదివరకు ఇచ్చిన దరఖాస్తుల సంగతేంటని ప్రశ్నిస్తూ స్థానిక సమస్యలపై ఏకరువు పెడుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ లకు నిరసన సెగ తగిలింది.నిరుపేదల నిరసన ఆందోళన మధ్య ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు జరుగుతున్నాయి. కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక జాబితా ఆమోదానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సభలు దరఖాస్తుల స్వీకరణ, నిరసన ఆందోళనకు వేదికలుగా మారాయి. ఏళ్ళ తరబడి రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం ప్రాథమికంగా తయారు చేసిన జాబితాలో పేర్లు లేకపోయేసరికి అర్హులైన నిరుపేదలు ఆగ్రహవేషాలు వ్యక్తం చేస్తూ అధికారులను పాలకులను నిలదీస్తున్నారు. ఇది వరకు ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయి... సమగ్ర కులగణన సర్వే ద్వారా తేల్చింది ఏంటి అని ప్రశ్నిస్తున్నారు. మళ్ళీ ఎందుకు దరఖాస్తులు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరసన ఆందోళనలతో చాలా గ్రామాల్లో ప్రభుత్వం ప్రాథమికంగా తయారు చేసిన జాబితాను ప్రకటించకుండా అర్హులైన నిరుపేదలందరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తామని అధికారులు పాలకులు ప్రకటించి తప్పించుకుంటున్నారు.ప్రజాపాలన గ్రామ సభలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు నిరసన సెగ తగిలింది. ఉమ్మడి జిల్లాలో సుడిగాలి పర్యటనతో నాలుగు గ్రామ సభలో పాల్గొన్నారు. మానకొండూర్ నియోజకవర్గం రేణికుంట, చొప్పదండి నియోజకవర్గం నారాయణపూర్, వేములవాడ నియోజకవర్గం రుద్రంగి, ధర్మపురి నియోజకవర్గం జైన గ్రామసభలో పాల్గొన్న మంత్రులకు నారాయణపూర్ రిజర్వాయర్ నిర్వాసితులు నిరసన సెగ తగిలించారు. రిజర్వాయర్ తో తమ కొంపలు ముంచొద్దని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో రిజర్వాయర్ నుంచి ఇళ్లలోకి నీళ్లు చేరి నిద్రలేని రాత్రి గడపవలసి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. మరికొందరు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇంకా ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకోవాలని నిలదీశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతుండగా ఆందోళనతో అడ్డుతగిలారు. దీంతో మాజీ సర్పంచ్ నజీర్ హుస్సేన్ ను పోలీసులు అరెస్టు చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వారిని సముదాయించి రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ళు నిరంతర ప్రక్రియ అని నిరుపేదలందరికీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రిజర్వాయర్ నిర్వాసితులకు



న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.గత పాలకుల నిర్లక్ష్యం వల్లే నిరుపేదలకు పదేళ్లుగా రేషన్ కార్డులు అందలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. 10 ఏళ్ళలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. రేషన్ కార్డుల కోసం ఇప్పటికీ 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు అర్హులైన పేదలను అందరికీ రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం త్వరలో ఇవ్వబోతున్నామని ప్రకటించారు. ప్రస్తుతం 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని అవి యధావిధిగా పని చేస్తాయని, పాత కార్డులను తొలగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు నిరంతర ప్రక్రియని తెలిపారు. ఇదివరకు దరఖాస్తు చేసుకోని వారు మాత్రమే ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో ప్రజావాణి, ప్రజాపాలన, మీసేవ లో దరఖాస్తు చేసుకున్న వారికి కుల గణనలో రేషన్ కార్డు లేదని తెలిపిన వారిలో అర్హులను గుర్తించి రేషన్ కార్డులు అందజేస్తామన్నారు.నాలుగు పథకాలు అమలు చేస్తున్న నేపథ్యంలో కొందరు ఓర్వలేక ప్రజల్ని రెచ్చగొడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. పదేళ్ళు ఏ పని చేయలేని వారు, ఇప్పుడు జాబితాలో పేర్లు లేవని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని చెప్పినా నమ్మకండి...ఎవ్వరు ఆందోళన చెందవద్దని మంత్రి పొన్నం కోరారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామన్నారు.గ్రామసభల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రాజెక్టుల బాటపట్టారు. నిర్మాణంలో ఉన్న నారాయణపూర్, కలికోట సూరమ్మ రిజర్వాయర్లను సందర్శించారు. స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం భూ సేకరణ పని పూర్తి కావాల్సి ఉందని అందుకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. కలికోట సూరమ్మ రిజర్వాయర్ లో వచ్చే వర్షాకాలంలో నీటిని నిలువ చేసేలా కృషి చేస్తామని మంత్రులు తెలిపారు. అదేవిధంగా ఏడాదిలోగా నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి నామమాత్రం ప్రయోజనం చేకూర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం జరిగేలా చూస్తుందన్నారు. నారాయణపూర్, కలికోట సూరమ్మ రిజర్వాయర్ లకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఏడాదిలో పూర్తి చేయిస్తామన్నారు. ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# రెవెన్యూ లో ఇంటి దొంగలు

**మెదక్ :** సమాజానికి ఉపయోగపడే ప్రభుత్వ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. కొంచెం అవకాశమున్నా అక్రమాలకు పాల్పడుతున్నారు. దొరికనంతా దోచుకుంటున్నారు. పేద, ధనిక అని తేడా లేకుండా వసూళ్ల పర్వం పడుతున్నారు. యువతకు రోల్ మోడల్ గా ఉండాల్సిన ప్రభుత్వ అధికారులు డబ్బుల కోసం దిగజారి ప్రవర్తిస్తున్నారు.తాజాగా ఎస్సారెస్పీ రెవిన్యూ అధికారులు టేకు దొంగలుగా మారారు. ఎలాంటి అనుమతి లేకుండా టేకు చెట్లను నరికివేస్తున్నారు. ఎస్సారెస్పీ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో ఎలాంటి గుట్టు చప్పుడు లేకుండా టేకు చెట్లను నరికి దొంగలిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. రక్షించాల్సిన అధికారులు భక్షించడమేంటని పలువురు నిలదీస్తున్నారు. కార్యాలయం లోపల టేకు చెట్లను నరికి దొంగలించి గదిలో భద్రపరిచారు. అంతేగాకుండా మొదలు భాగం కనబడకుండా మోరం కప్పే ప్రయత్న చేస్తున్నారు.అయితే.. మీడియా ప్రతినిధులను చూడగానే స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్ అయిన అజయ్ కుమార్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. తనకు ఈ టేకు చెట్ల దొంగతనానికి ఎలాంటి సంబంధం లేదని బుకాయింపు చర్యలకు పాల్పడ్డాడు. ఫారెస్ట్ అధికారులు కార్యాలయానికి చేరుకుని.. కార్యాలయం తలుపులు బద్దలు గొట్టి టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 15 టేకు దుంగలను గుర్తించి నెంబరింగ్ వేసి పంచనామా చేశారు. అక్రమాలకు పాల్పడిన ఈ రెవిన్యూ అధికారులపై ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.నిజాయితీ ఉండాల్సిన ప్రభుత్వ అధికారులు ఇలా అవినీతికి పాల్పడడం పట్ల సోషల్ మీడియాలో నెటిజన్లు నిలదీస్తున్నారు. ఇలాంటి అవినీతి పనులకు పాల్పడే అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. ఇప్పటికైనా అవినీతి పనులకు పాల్పడే అధికారులు బుద్ధి తెచ్చుకోవాలని తిట్టిపోస్తున్నారు

## అజయ్ దేవగన్ తో నటిస్తున్న

# మృణాల్ ఠాకూర్





సీతారామంతో సూపర్ హిట్ అందుకున్న మృణాల్ ఠాకూర్ ఆతర్వాత హాయ్ నాన్న సినిమాతో మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ బ్యూటీ ఇటు టాలీవుడ్‌లోనే కాదు బాలీవుడ్‌లో కూడా దూసుకెళ్తోంది. తాజాగా ఈ బ్యూటీకి ఓ లక్కీ ఆఫర్ వచ్చింది. 2013 లో రాజమౌళి డైరెక్షన్‌లో వచ్చిన మర్యాద రామన్న రీమేక్ గా బాలీవుడ్‌లో సన్ ఆఫ్ సర్దార్ సినిమా వచ్చింది. ఆ సినిమాకు సీక్వెల్ చేస్తున్నారు. అయితే రాజమౌళికి ఈ సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమాకి ఏమాత్రం సంబంధం లేదు. ఇక సన్ ఆఫ్ సర్దార్ 2లో మృణాల్ ఠాకూర్‌కి ఛాన్స్ వచ్చింది. అజయ్ దేవగన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో అవకాశం రావడం పట్ల ఈ బ్యూటీ ఎంతో హ్యాపీగా ఉంది. సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమాలో ఆమెది కూడా మంచి పాత్ర అని.. సినిమాలో ఆమె సీ న్స్ కూడా హైలెట్‌గా నిలుస్తాయని తెలిసింది.




## లైలా నుంచి 'ఇచ్చుకుందాం బేబీ..'

మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ అప్ కమింగ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'లైలా'. ఇటీవల రిలీజైన టీజర్ సంచలనం సృష్టించింది. ఈ చిత్రంలో విశ్వ క్‌సేన్ అమ్మాయి,- అబ్బాయిగా కనిపించనున్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ బ్యాన ర్‌పై సాహు గారపాటి నిర్మించారు. 'లైలా' ఫస్ట్ సింగిల్ సోనూ మోడల్ వీడియో సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. మంగళవారం మేకర్స్ సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. సెకండ్ సింగిల్ 'ఇచ్చు కుందాం బేబీ' ఈనెల 23న రిలీజ్ కానుంది. లీడ్ పెయిర్ రొమాంటిక్ కెమి స్ట్రీని చూపించిన సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఆకాంక్ష శర్మ ఈ చిత్రంలో కథానాయికగా నటి స్తోంది. లైలా సినిమా ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది.




## తండేల్ నుంచి 'హైలెస్సో హైలెస్సా..' వచ్చేస్తోంది



యువ సామ్రాట్ నాగ చైతన్య నటిస్తున్న లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. సాయి పల్లవి కథానాయికగా నటిస్తోంది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్లు బ్లాక్ బస్టర్ నోట్‌లో ప్రారంభమయ్యాయి. ఫస్ట్ సింగిల్ 'బుజ్జి తల్లి' సెన్సేషనల్ హిట్ అయింది. ఇటీవల రిలీజైన సెకండ్ సింగిల్ 'నమో నమః శివాయ' మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'తండేల్' థర్డ్ సింగిల్ బ్లాక్‌బస్టర్ లవ్ సాంగ్ హైలెస్సో హైలెస్సా ఈనెల 23న రిలీజ్ కానుంది. సముద్ర తీరంలో రగ్గడ్ లుక్‌లో లవ్లీ స్మైల్‌తో నిలుచున్న నాగచైతన్య, ఎదురుగా బ్యూటీఫుల్ గా డ్యాన్స్ చేస్తూ సాయి పల్లవి కనిపించిన సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తండేల్ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కానుంది.

## ఛత్రపతి శంభాజీగా విక్కీకౌశల్..

# గూస్‌బంప్స్ తెప్పిస్తున్న 'ఛావా' ట్రైలర్



బాలీవుడ్ నుంచి వస్తున్న ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ ఛావా. నటుడు విక్కీ కౌశల్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ సినిమాకు లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తుండగా.. మడాక్ ఫిల్మ్స్ పతాకం పై దినేశ్ విజన్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. మహారాష్ట్ర యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పెద్ద కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా రాబోతుండగా.. రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమా వాలంటైన్స్ డే కానుకగా.. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఛత్రపతి శివాజీ మహరాజ్ మరణానంతరం మరాఠా సామ్రాజ్యానికి రాజుగా నియమితులవుతాడు శివాజీ కుమారుడు శంభాజీ మహరాజ్. అయితే శంభాజీని చంపి మరాఠాను దక్కించుకోవాలని చూస్తాడు మొగల్ చక్రవర్తి ఔరంగజేబు. ఈ క్రమంలోనే ఏం జరిగింది అనేది తెలియాలంటే సినిమా వచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే. చాలా రోజుల తర్వాత బాలీవుడ్ నుంచి హిస్టరీ బ్యాక్‌డ్రాప్‌లో సినిమా వస్తుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com